

**అమ్మకానికీ అవస్థలే..**

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండిస్తే అమ్మ కాల్లోనూ రైతులకు అవస్థలు తప్పడం లేదు. కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 8లో



**మొదటి నెల 97 శాతం**

ఏప్రిల్‌లో 53,64,786 టన్నుల బొగ్గు ఉత్ప త్తి లక్ష్యానికి గాను 52,19,128 టన్నుల (97 శాతం) ఉత్పత్తి నమోదైంది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 23°

**వాతావరణం**

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు సాధార ణంగానే ఉంటాయి. కొన్ని చోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ప్రతి సోమ వారం ఈ రూపంలో అలంకరించడం ప్రత్యే కత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్ర భాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండ పంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, సాయంత్రం బేడా మం డపంలో శ్రీ సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు.

### రేపు డయల్ యువర్ ఎస్పీ

కొత్తగూడెంటౌన్: డయల్ యువర్ ఎస్పీ కార్య క్రమాన్ని ఈనెల 3న నిర్వహించనున్నట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1న జరగాల్సి ఉండగా, సాం కేతిక కారణాలతో వాయిదా వేసినట్లు పేర్కొ న్నారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజే యాలని సూచించారు.

### 'అన్నవరం క్షేత్ర చరిత్ర' ఆవిష్కరణ



గ్రంథాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యనారాయణ తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం పండితులు ఎస్‌టీజీ అంత ర్వేది కృష్ణమాచార్యులు రచించిన అన్నవరం క్షేత్ర చరిత్ర గ్రంథాన్ని ఏపీ దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆవిష్కరిం చారు. సోమవారం అన్నవరం క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాన్ని పరిశీలిం చిన మంత్రి రచయితతో పాటు చిత్రకారుడు నీలి వెంకటరమణను అభినందించారు. కృష్ణ మాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో అన్నవరం ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాల కేంద్రంతో శిశు మరణాల తగ్గింపు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా జనరల్ ఆస్ప త్రిలో ఎంసీహెచ్‌లో ఏర్పాటుచేసిన సమగ్ర చనుబాల నిర్వహణ కేంద్రం ద్వారా శిశు మర ణాలు తగ్గుముఖం పట్టాయని పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు తెలిపారు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు తల్లిపాల సేకరణ, నిర్వహణ కేంద్రం ద్వారా ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. కేంద్రం ఏర్పాటుచేసి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ కేక్ కట్ చేసి మాట్లాడారు. ఈ కేంద్రం ద్వారా ఏడాదిలో 725 మంది తల్లుల నుండి 2,37,975 మి.లీ పాలు సేకరించి 706 మంది శిశువులకు అందజేశా మని పేర్కొన్నారు. ఆర్ఎంఓలు బి. శ్రీనివాస రావు, అమర్‌సింగ్, మిల్క్ బ్యాంక్ ఇన్‌చార్జ్ డాక్టర్ పవన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్ : కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం వద్ద చేరిన వరదనీరు



పాల్వంచరూరల్ : గొల్లగూడెంలో ధాన్యంపై కప్పిన పరదాల నుంచి వాన నీటిని తొలగిస్తున్న రైతులు

# అన్నదాతపై అకాల పిడుగు

**ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం**

- తడిసిన ధాన్యం, మొక్కజొన్న
- పంటలను రక్షించుకునేందుకు రైతుల పాట్లు
- పరిహారం అందించాలని వేడుకోలు

సాక్షి, నెట్‌వర్క్: అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ఓ వైపు చేతికందే దశలో ఉన్న పంటలు వర్షం, ఈదురు గాలులకు నేలమట్టం అవుతుండగా, ఇప్పటికే కోసి కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్క జొన్న వరద నీటికి తడిసి ముద్ద వుతున్నాయి. కొన్నిచోట్ల వరద లో కొట్టుకుపోతున్నాయి. ముఖ్యంగా కోసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అన్నపురెడ్డి పల్లి మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పై టార్పాలిన్లు కప్పినా భారీ వర్షం కురవడంతో ధాన్యం రాశులపైకి నీరు చేరుతోంది. ఇల్లెందు మం డలం ముత్తారపుకట్ట గ్రామంలో ఆదివారం సాయంత్రం వర్షం కురవగా తడిసిన మొక్కజొన్న గింజలను రైతులు ప్రధాన రహదారిపై ఆరబె ట్టారు. అయితే అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షంతో పూర్తిగా కొట్టుకు పోయింది. వర్షం ఏకధాటిగా కురవడంతో గిం జలను కుప్పగా చేసుకునే అవకాశం కూడా లేకుం డా పోయింది. ఇలా 100 క్విం టాళ్లకు పైగా మొక్కజొన్నకు నష్టం వాటిల్లింది. జూలూరు పాడు మండలంలో సోమ వారం తెల్లవారుజామున భారీ వర్షం, ఈదురు గాలలతో చెట్లు విరిగిపడగా, ఇళ్ల పైకప్పు రేకు లు లేచిపోయాయి. జూలూరు పాడు, వెంగన్నపాలెం, సాయి రాంతండా, దండుమిట్టతండా, కరివారిగూడెం తదితర గ్రామా ల్లోని మొక్కజొన్నకు తీవ్ర నష్టం వాటిల్లింది. టేకులపల్లి మండలంలో కల్లాల్లో ఆరబె ట్టిన మొక్కజొన్న, మిర్చి తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పాల్వంచ మండలంలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని కొత్తసూరారం, సోములగూడెం, సంగం, దంత లబోరు తదితర గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వల్లే తమకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. అశ్వా రావుపేట మండల కేంద్రంతో పాటు ఊట్లపల్లి, నారాయణపు రంలోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపో యింది. తెల్లవారుజామున వర్షం కురవడంతో రైతులు ఆయా కేంద్రాలకు చేరుకునే లోపే తడిసి ముద్దయింది. అశ్వారావుపేట, నారాయ ణపురం కేంద్రాల్లో ధాన్యం రాశుల చుట్టూ వరద నీరు నిల వడంతో కాలువలు తీసి బయ టకు వెళ్లేలా చేశారు. ఈ మూడు కేంద్రాల్లో దాదాపు 2,200 క్వింటాళ్ల ధాన్యం తడి సిందని రైతులు అంటున్నారు. అయితే అధికారులు మాత్రం కొద్దిమేర మాత్రమే నష్టం వాటిల్లిందని అంటున్నారు.




| మండలం | వర్షపాతం (మి.మీ.) |
|---|---|
| పినపాక | 9.8 |
| చర్ల | 8.2 |
| దుమ్ముగూడెం | 10.4 |
| అశ్వాపురం | 18.6 |
| మణుగూరు | 12.4 |
| గుండాల | 6.2 |
| ఇల్లెందు | 16.0 |
| టేకులపల్లి | 17.0 |
| జూలూరుపాడు | 23.6 |
| చంద్రుగొండ | 28.8 |
| కొత్తగూడెం | 19.0 |
| పాల్వంచ | 18.4 |
| బూర్గంపాడు | 19.6 |
| భద్రాచలం | 18.0 |
| ములకలపల్లి | 54.4 |
| దమ్మపేట | 28.4 |
| అశ్వారావుపేట | 62.4 |

**జిల్లాలో 21.8 మి.మీ. వర్షం**

చుంచుపల్లి: జిల్లాపై ఉపరితల ద్రోణి ప్రభావం కొనసాగుతోంది. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వారం క్రితం వరకు విపరీతంగా ఎండలు మండిపోయాయి. పగటి ఉష్ణోగ్ర తలు 44.2 డిగ్రీల వరకు నమోద య్యాయి. అయితే ఇటీవలి వర్షాల తో వాతావరణం చల్లబడినప్ప టికీ.. పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమ వారం ఉదయం వరకు 21.8 మి.మీ. సగటు వర్షపాతం నమో దైంది. 14 మండలాల్లో 10 మి.మీ. కంటే అధికంగా వర్షం పడింది. అత్యధికంగా అశ్వారావు పేట మండలంలో 62.4 మి.మీ., ములకలపల్లిలో 54.4 మి.మీ. చొప్పున వర్షం కురిసింది.



కొత్తసూరారంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



జూలూరుపాడులో తడిసిన మొక్కజొన్నను చూపిస్తున్న రైతు



వరదకు కొట్టుకుపోతున్న రోడ్డుపై ఆరబోసిన మొక్కజొన్న

## సమస్యల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన సమ స్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అద నపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. సోమ వారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి లో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరిం చారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. మేడే కావం తో ఈసారి ప్రజావాణికి తక్కువ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

**వచ్చిన దరఖాస్తులలో కొన్ని..**

- పాల్వంచ నవభారత్ పరిధిలోని సర్వే నం బర్ 444లోని ప్రభుత్వ భూముల్లో అను మతి లేకుండా అక్రమ కట్టడాలు చేస్తున్నా రని, వెంచర్లు వేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతానికి చెందిన ఎండి అఫ్జల్ పర్వీన్ ఫిర్యాదు చేయగా పాల్వంచ తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు.
- దుమ్ముగూడెం మండలం దుబ్బనూతల గ్రామానికి చెందిన సొందే తులశమ్మ సర్వే నంబర్ 108/5 ప్రభుత్వ భూమిలో ఎంతో కాలంగా వ్యవసాయం చేసుకుంటున్నా మని, తనకు యాజమాన్య హక్కు కల్పిం చాలని చేసిన దరఖాస్తును ఈ సెక్షన్ సూప రింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన వి.స్వాతి తాము రేకుల షెడ్డులో ఉంటున్నామని, గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేయగా డబుల్ బెడ్ రూం పర్యవేక్షణ అధికారికి ఎండార్స్‌చేశారు.
- మణుగూరు మండలం కొత్తకొండాపురం గ్రామానికి చెందిన కారం సాయికిరణ్ ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లడానికి పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించానని, రెండు సంవత్సరాలకు రూ. 25 లక్షలు ఖర్చు అవు తుందని, తమది పేద కుటుంబం అయినం దున విద్యారుణం ఇప్పించాలని వినతిప త్రం అందించగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనే జర్‌కు ఎండార్స్ చేశారు.

## ఐటీడీఏలో ఐదుగురికి షోకాజ్ నోటీసులు

**రచ్చకెక్కిన డిప్యూటేషన్ల రద్దు**

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వార్డెన్ల డిప్యూటేషన్ల రద్దు విషయం రచ్చకెక్కింది. విద్యా సంవత్సరం ముగిసిన ఏప్రిల్ 24న వార్డెన్ల డిప్యూటేషన్లను రద్దు చేసి పూర్వ స్థానాల్లో రిపోర్టు చేయాలని ఐటీడీఏ డీడీ రమాదేవి ఆదేశాలు జారీ చేశారు. చివరి రోజు, చివరి క్షణంలో ఈ నిర్ణయం తీసుకోవడంతో అనేక మంది రిపోర్టు చేయలేకపోయారు. అంతేకాకుండా ఆ క్షణంలో హడావిడి ఆదేశాలపై ఫిర్యాదులు రావ డంతో ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు సీరియస్‌గా దృ ష్టి సారించారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఐటీ డీఏలో సోమవారం ఐదుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారిలో డీడీ రమాదేవి, భద్రాచలం, దమ్మపేట ఏటీడబ్ల్యూఓలు నర్సింహారావు, చంద్ర మోహన్, ఏసీఎంఓ రమణయ్య, అసిస్టెంట్ ఏసీఎం ఓ భావ్‌సింగ్ ఉన్నారు. దీనిపై వివరణ ఇవ్వాలని వారిని ఆదేశించారు.

**'ఆశ్రమం'లో ఆది నుంచీ అక్రమ డిప్యూటేషన్లే..**

ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వార్డెన్ల విధుల్లో ఆది నుంచీ అక్రమ డిప్యూటేషన్లు ఇష్టారాజ్యంగా నడు స్తున్నాయి. వాస్తవానికి బదిలీలు, ప్రమోషన్ల అనం తరం డిప్యూటేషన్లను పారదర్శకంగా చేపట్టాలి. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అధికారులు ఇష్టారాజ్యంగా మౌఖిక ఆదేశాలతోనే డిప్యూటేషన్లు వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. దీనిపై గతంలో 'సాక్షి'లో కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. ఉపాధ్యాయ సంఘాలు నిర సనలు వ్యక్తం చేశాయి. దీంతో ఆ కొద్ది రోజులే డిప్యూటేషన్లను రద్దు చేసి మళ్లీ చేపట్టారు. నిబంధ నలకు పాతరేసి ఉపాధ్యాయులకు, వార్డెన్లు కోరిన చోటనే కేటాయించడం గమనార్హం. దీని వెనుక భారీగానే ముడుపులు చేతులు మారాయనే ఆరోప ణలూ ఉన్నాయి. ఏడాది పాటు ఈ డిప్యూటేషన్లపై వివాదం నడుస్తుండగా విద్యా సంవత్సరం ముగిసిన తరువాత దీనిపై ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయటంలో అంతర్యమేం టని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ అక్రమ డిప్యూటేషన్లపై ఉన్నత స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పారదర్శకంగా ఉపాధ్యాయుల, వార్డెన్ల జాబితా ప్రకటించి పదోన్నతులు, బదిలీల అనంతరమే అవ సరమైన చోట డిప్యూటేషన్లను చేపట్టాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం

## మూడు ఆస్పత్రుల్లో రక్త నిల్వ కేంద్రాలు

**జిల్లాకు రూ.47 లక్షలు విడుదల**

సూపర్‌బజార్(కొత్తగూడెం)/ఇల్లెందు: జిల్లాలోని మూడు ప్రభుత్వ వైద్యశాలల్లో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఇం దుకోసం రూ.47 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో బ్లడ్ బ్యాంకుల ఏర్పాటుకు రూ.13 లక్షల చొప్పున రూ.39 లక్షలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక పాల్వంచలో ఇప్పటికే రక్త నిల్వ కేంద్రం ఉండగా మరమ్మతుల కోసం రూ.8 లక్షలు వెచ్చిస్తున్నట్లు వివ రించారు. ఆయా ఆస్పత్రుల్లో రక్త నిల్వకు అవసర మైన ఫ్రిడ్జ్‌లు, ఇతర పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. గత ఆరునెలలుగా బ్లడ్ స్టోరేజీ యూనిట్ల ఏర్పాటుకు కృషి చేసిన ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబును కలెక్టర్ అభినందించారు.



ఇల్లెందు ఆస్పత్రికి చేరుకున్న పరికరాలతో వైద్యులు

## పారిశుద్ధ్య కార్మికులకు మేడే కానుక

- వర్కర్ల వేతనం రూ.1000 పెంపు
- జిల్లాలో 2వేల మందికి లబ్ధి

చుంచుపల్లి: నిత్యం పారిశుద్ధ్య పనుల్లో నిమగ్న మయ్యే గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికు లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి రూ.1,000 వేతనం పెంచుతూ నిర్ణయం తీసుకుం ది. ఎన్నో ఏళ్లుగా అరకొర వేతనాలతో ఇబ్బంది పడుతున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇది కొంత ఆస రా కానుంది. గత నాలుగేళ్లుగా గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనంతో పాటు వీధులను శుభ్రం చేస్తూ ప్రగతిపథంలో నడిపించడంలో ఈ కార్మికు లు కీలకపాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో వారు చేసిన కృషి వెలకట్టలేనిది. అప్పుడే వీరి వేతనం పెంచాలని ప్రభుత్వం భావిం చినా సాధ్యం కాలేదు. ఎట్టకేలకే కార్మిక దినోత్సవ మైన మే 1న వేతనాలు పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో 2007 మంది కార్మికులు..**

జిల్లాలో 481 గ్రామ పంచాయతీల పరిధిలో 1,557 మంది, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీల పరిధిలో 450 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. మేజర్ పం చాయతీల్లో 10 నుంచి 12 మంది, చిన్న పంచాయ తీల్లో నలుగురి నుంచి ఆరుగురు వరకు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని మేజర్ పంచాయ తీల్లో అవసరాన్ని బట్టి అదనంగా తాత్కాలిక సిబ్బందిని కూడా నియమిస్తున్నారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ పరిధిలో వీరిని మల్టీపర్పస్ వర్క ర్లుగా పిలుస్తున్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం , మొక్కలు, పాఠశాలల్లో పరిశుభ్రత, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సర ఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు. వీరితో పాటు కొన్ని పంచాయతీల్లో చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన ట్రాక్టర్ల నిర్వహణకు ఇద్దరు చొప్పున వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చిన్న పంచాయతీల్లో పని చేస్తున్న ఒక్కో కార్మికుడికి నెలకు రూ.8,500, మేజర్ పంచాయ తీల్లో పని చేసే వారికి రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఇక మున్సిపాలిటీల్లో సెమీ స్కిల్డ్ వర్కర్లకు నెలకు రూ.15,500, స్కిల్డ్ వర్క ర్లకు రూ.19,500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వీరందరికి మరో రూ.1000 అదనంగా పెరగనుంది.



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

**వేతన పెంపు హర్షణీయం**



గ్రామపంచాయతీ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అదనం గా రూ.1000 వేతనం పెంచు తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. గ్రామాలు, పట్టణాల్లో వీధులను నిత్యం శుభ్రం చేయడమే కాక, వాటి అభివృద్ధిలో కీలకంగా వ్యవ హరిస్తున్న వర్కర్ల సేవలను గుర్తించటం సంతోషం.

– ఎండీ యూసుఫ్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

**కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి**



పట్టణాలు, పంచాయతీల్లో నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రభు త్వం రూ.1000 అదనంగా పెంచడం మంచి నిర్ణయమే. అయితే విధుల్లో నిత్యం శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులపై ప్రభుత్వం మరింతగా దృష్టి పెట్టి కనీస వేతనం నెలకు రూ.21 వేలు చెల్లించాలి.

– నరాటి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు

## కార్మిక హక్కులను కాలరాస్తున్నారు..

- ప్రధాని మోదీకి గుణపాఠం చెప్పాలి
- మేడే వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

జూలూరుపాడు: కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రధాని నరేంద్రమోదీకి గుణపాఠం చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. జూలూరుపాడులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మికుల విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. కార్మికుల హక్కులు, రక్షణ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. దేశవ్యాప్తం గా 30 కోట్ల మందికి సంఘటిత, అసంఘటిత కార్మికులు పోరాడి తెచ్చుకున్న 44 చట్టాలను కేం ద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించాలని నిర్ణ యించిందని, దీంతో కార్మికుల నుంచి తీవ్ర ప్రతిఘ టన వ్యక్తమైందని వివరించారు. ప్రభుత్వ రంగ సం స్థలను ప్రైవేట్‌పరం చేస్తూ ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. అంతకుముందు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు ఎర్రబాబు, చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెం కటేశ్వర్లు, సిలివేరి నరసింహారావు, పూరేటి సత్య నారాయణ, పిన్నుల ఆంజనేయులు, గుడిమెట్ల సీతయ్య, బలుగూరి నరసింహారావు, కరీముల్లా, కృష్ణ, పాలెపు వెంకటేశ్వర్లు, కిలారి రామయ్య, మాగంటి రామారావు తదితరులు పాల్గొన్నారు.



శ్రమజీవుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కూనంనేని సాంబశివరావు, సాబీర్‌పాషా తదితరులు

## క్లుప్తంగా

### జేఈఈ మెయిన్స్‌లో ప్రభుత్వ కళాశాల విద్యార్థి ప్రతిభ


సింహాద్రి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వ కళాశాల విద్యార్థి ధర్మసోతు సింహాద్రి జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో 69.83 పర్సంటైల్ సాధించాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్ సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థిని అధ్యాపకులు బండి వెంకటేశ్వరరావు, నర్సింహారావు, హసీనా, సాయినాథ్, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

### సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న రజాక్

కొత్తగూడెంటౌన్: సమ్మర్ క్యాంప్‌లో శిక్షణ తరగతులను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని టీబీజీకేఎస్ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ సూచించారు. సోమవారం కొత్తగూడెం జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా అథ్లెటిక్స్‌లో శిక్షణ శిబిరాన్ని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మహీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులు ముగిసేలోగా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి క్రీడా దుస్తులను అందజేస్తామని హామీ ఇచ్చారు. రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, ఆర్.రాజేంద్ర ప్రసాద్, కోచ్‌లు నాగేంద్ర, రాము, కన్వీనర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

### కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి జావీద్ పాషా

ఖమ్మంలీగల్: అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తెలిపారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి సోమవారం పల్లెగూడెంలోని ఇటుక బట్టీ కార్మికులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన సుకన్య సమృద్ధి యోజన, ఈ శ్రమ్, ప్రధానమంత్రి బీమా తదితర పథకాలపై అవగాహన కల్పించారు. కాగా, కార్మికుల వెంట ఉన్న పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి టి.విష్ణువందన, చైల్డ్ లైన్ సమన్వయకర్త కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బట్టల దుకాణంలో చోరీ

చుంచుపల్లి: విద్యానగర్‌లోని జీవీ మాల్‌లో సోమవారం షాపింగ్ పేరుతో చీరల చోరీకి యత్నించిన మహిళను వర్కర్లు పట్టుకున్నారు. షాపింగ్ చేసేందుకు వచ్చిన ఇద్దరు మహిళల్లో ఒకరు చీరలు తస్కరించి వెళ్లిపోగా, మరొకరు అదే ప్రయత్నంలో ఉండి పట్టుబడింది. ఆమెను చుంచుపల్లి పోలీసులకు అప్పగించారు. యాజమాన్యం రూ.75 వేల విలువైన చీరల చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా, చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

టేకులపల్లి: బంగారం చైన్ చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. టేకులపల్లి ఎస్ఐ రమణారెడ్డి సోమవారం రాత్రి వివరాలు వెల్లడించారు. ఎస్ఐ కథనం ప్రకారం.. ఏపీలోని కృష్ణాజిల్లా ఘంటసాల మండలం ఎండకుదురు గ్రామానికి చెందిన తలువుల శ్రీసాయి తన కుటుంబ సభ్యులు ఏడుగురితో కలిసి కారులో గత నెల 22న భద్రాచలం వైపు బయలుదేరారు. తొమ్మిదోమైలుతండా వద్దకు రాగానే అదుపుతప్పిన లారీ కారుని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్న వారికి గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఇదే గ్రామానికి చెందిన మంగీలాల్, శంకర్ సంఘటనా స్థలానికి వెళ్లి కారులో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను చోరీ చేశారు. బాధితుడు శ్రీసాయి గత నెల 27న ఫిర్యాదు చేయగా, పోలీసులు గత నెల 29న రాత్రి టేకులపల్లి సెంటర్‌లో నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం నిందితులను ఇల్లెందులో కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

### జూదరులు అరెస్ట్

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మందిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారులోని మొక్కజొన్న పొలంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎస్ఐ పాదిల వెంకన్న తమ సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

# అమ్మకానికీ అవస్థలే..

**ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..**

- 136 కేంద్రాలు ప్రారంభించినా 34 చోట్లే కొనుగోళ్లు..
- ప్రభుత్వ శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- మరోవైపు అకాల వర్షాలతో రైతుల మనోవేదన
- యాసంగి వడ్లు విక్రయించేందుకు అన్నదాతల పాట్లు

సాక్షి పరిశీలన


అన్నపురెడ్డిపల్లి మండలంలో ధాన్యం పట్టాలపై నిలిచిన వర్షపునీరు

దుక్కి దున్ని నాటేసింది మొదలు ధాన్యం చేతికొచ్చాక కూడా అన్నదాతలకు అవస్థ తప్పడంలేదు. అష్టకష్టాలు పడి పంటలు పండించాక అమ్మకాలకూ ప్రయాస పడాల్సి వస్తోంది. మిల్లర్ల కొర్రీలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం వెరసి కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. మరోవైపు అకాల వర్షం రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పంటల సాగుకు ఎంత శ్రమపడుతున్నామో.. పండించిన ధాన్యం విక్రయించేందుకూ అంతే శ్రమపడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

– సూపర్‌బజార్(కొత్తగూడెం)

ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఆర్భాటంగా ప్రారంభించినా అన్ని కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభంకాలేదు. ఈసారి యాసంగి సీజన్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో కోతలు కూడా ఆలస్యంగానే జరుగుతున్నాయి. కోతలు పూర్తయ్యాక రైతులు ధాన్యం కేంద్రాలకు తరలించి ఆరబెట్టాక అధికారులు టోకెన్లు పంపిణీ చేశారు. కానీ కొనుగోళ్లు అన్ని చోట్ల జరపడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. ధాన్యం తడిస్తే ఆరుగాలం శ్రమ వృథా అవుతుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో 136 కేంద్రాలు ప్రారంభించినప్పటికీ 34 కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే అరకొరగానే సేకరించినట్లు అర్థమవుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందోనని కేంద్రాలు రైతులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణలేమి, క్షేత్రస్థాయి సిబ్బందికి జవాబుదారీతనం లేకపోవడంతో తాము నష్టపోవాల్సివస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకే వరి పంట నేలవాలి పంట నష్టపోయారు. ప్రారంభానికి ముందు సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన సౌకర్యాల కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ కొన్నిచోట్ల మినహా సౌకర్యాలు కనిపించడంలేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. పాల్వంచ మండలం సోములగూడెం కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లలో జాప్యంపై రైతులు డీసీఓ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన కేంద్రాన్ని సందర్శించి పరిస్థితి చక్కదిద్దడంతో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇలా అన్ని కేంద్రాల నుంచి సమాచారం ఉన్నతాధికారుల దృష్టి వెళ్లే అవకాశం తక్కువగా ఉండటంతో అన్నదాతలకు కష్టాలు తప్పడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అలసత్వం వీడి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**సేకరించింది 3,226.760 మెట్రిక్ టన్నులే..**

జిల్లావ్యాప్తంగా అధికారులు తొలుత 134 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రకటించి ప్రారంభించారు. అనంతరం మరో 2 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 136 కేంద్రాలు ప్రారంభించినా కేవలం 34 కేంద్రాల్లోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కు రూ.2060 కాగా, సాధారణ రకానికి రూ.2040 చొప్పున ప్రభుత్వం చెల్లించనుంది. 136 కేంద్రాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 105, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 3, జీసీసీ ఆధ్వర్యంలో 28 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. యాసంగి సీజన్‌లో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యంగా పెటుకున్నారు. పక్షం రోజులు గడిచినా 3226.760 మెట్రిక్ టన్నులే కొన్నారు.


పాల్వంచ మండలం సోములగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ వెంకటేశ్వర్లు(ఫైల్)

**సమస్యలుంటే మాకు సమాచారం ఇవ్వండి..**

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఏమైనా ఉంటే రైతులు మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే పరిష్కరిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోళ్లలో ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి కంట్రోల్‌రూం నంబర్ కూడా ఏర్పాటు చేశాం.

–వెంకటేశ్వర్లు, డీసీఓ

**నరకయాతన పడుతున్నాం**



ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలి. ప్రారంభించామని చెప్పి కొనుగోలు చేయకపోతే ధాన్యాన్ని అకాల వర్షాలకు కాపాడుకోలేక నరకయాతన పడుతున్నాం. కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలి.

–నూకల నాగిరెడ్డి, రైతు, రెడ్డిగూడెం, పాల్వంచ మండలం

**సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూం**

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు, పీపీసీ సెంటర్లకు ఏమైనా సమస్యలుంటే పరిష్కరించడానికి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో 08744-241950కు ఫోన్ చేయాలని, గన్నీబ్యాగుల సమస్యలకు 9908172903 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తే..**

- ఇప్పటివరకు కేవలం 34 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇంకా 102 కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడంలేదు.
- ధాన్యం మిల్లాడిస్తే నూకశాతం ఎక్కువగా వస్తుందని మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. సమస్యపై అధికారులు దృష్టి సారించకపోవడంతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని రైతులు పేర్కొంటున్నారు.
- 40 కేజీల చొప్పున ధాన్యం బస్తాలు తూకం వేయాల్సిఉండగా మిల్లర్ల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు 42 కేజీల చొప్పున కాంటా పెడుతున్నారు. ఈ చొప్పున క్వింటాకు 5 కేజీల చొప్పున నష్టపోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మరోవైపు అకాల వర్షాలు రైతులను ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్నాయి. రేయింబవళ్లు పట్టాలు కప్పుకుంటూ ధాన్యం కాపాడుకోలేక కర్షకులు కన్నీరు పెట్టుకుంటున్నారు.
- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. పౌరసరఫరాల శాఖ కేంద్రాలు ఏర్పాటు చేస్తే, వ్యవసాయశాఖ టోకెన్లు జారీ చేస్తోంది. సహకార శాఖ కొనుగోళ్లు చేపడుతోంది. ఈ మూడు శాఖల అధికారులు సమన్వయం చేసుకోకపోవడంతో కేంద్రాలకు తరలించిన ధాన్యం 15 రోజులు గడుస్తున్నా కొనే పరిస్థితి లేదు.
- ఎప్పటిలాగే కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ పట్టాల సమస్య ఉత్పన్నమవుతోంది. కొన్నేళ్లుగా అధికారులు పట్టాలు ఇవ్వకపోవడంతో ధాన్యం ఆరబెట్టుకునేందుకు, వర్షానికి తడవకుండా కప్పుకు రైతులు పట్టాలను అద్దెకు తెచ్చుకోవాల్సి వస్తోంది.
- జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు సగటున 21.8మి.మీ వర్షపాతం నమోదుకాగా పలుచోట్ల కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.
- కేంద్రాల్లో రోజుకు ఎంత ధాన్యం కొంటారు? ఎంత మంది రైతులవి కొనుగోలు చేస్తారనే సమాచారం ముందస్తుగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

# కేసీఆర్ గద్దె దిగితేనే రైతులకు మేలు

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల
- పంట నష్టపోయిన అన్నదాతలకు పరామర్శ


పాలేరులోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

ఖమ్మం రూరల్/కూసుమంచి/తిరుమలాయపాలెం: రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీవిధానాలతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, రైతుల కష్టాలు తీరి ఆనందంగా ఉండాలంటే సీఎం కేసీఆర్‌ను గద్దె దించాల్సిన అవసరముందని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం సాయిగణేష్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మేడే సందర్భంగా ఆమె సోమవారం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆతర్వాత కూసుమంచి మండలం కిష్టాపురం, పాలేరులోని ధాన్యం కేంద్రాలు, తిరుమలాయపాలెం మండలంలోని తెట్టెలపాడులో దెబ్బతిన్న పంటలను షర్మిల పరిశీలించారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని, కాంటా అయిన ధాన్యాన్ని సకాలంలో తరలించకపోవడంతో నష్టపోతున్నామని రైతులు తమ బాధ చెప్పుకున్నారు. దివంగత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి పాలనలోనే బాగున్నామని తెలిపారు. ఈసందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఆర్భాటంగా కేంద్రాలు ప్రారంభించడమే తప్ప ఇతర విషయాల్లో జాప్యంతో అకాల వర్షం కారణంగా రైతులు నష్టపోయారని తెలిపారు.

**రైతులకు భరోసా లేదు**

కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు భరోసా లేదని చెప్పారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని చెప్పారు. దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ, నష్టపరిహారం చెల్లించడంతో పాటు అనేక పథకాలు అమలుచేశారని గుర్తు చేశారు. మళ్లీ వైఎస్సార్ పాలన తెచ్చుకుందామని, అప్పటి వరకు రైతులు ధైర్యంగా ఉండాలని షర్మిల సూచించారు.

**పోటీ ఇక్కడి నుంచే...**

వచ్చే ఎన్నికల్లో తాను పాలేరు నుంచే పోటీ చేస్తానని షర్మిల స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే నిర్ణయం జరిగిందని.. ఎలాంటి అపోహలకు తావులేదని తెలిపారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్నాయని షర్మిల ఆరోపించారు. కార్మికుడు లేకపోతే మెతుకు లేదని, ఇంటికి వెలుగు రాదని తెలిపారు. తెలంగాణ ఆర్టీసీలో కార్మిక సంఘాలను రద్దు చేయగా, విద్యుత్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేశారని పేర్కొన్నారు. కార్మికులకు పనివేళలు, సంక్షేమం విషయంలో చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. ఈకార్యక్రమాల్లో వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకుడు పిట్టా రాంరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత, నాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి, తుంపాల కృష్ణమోహన్, బాలాజీరావు, సత్యనారాయణ, పోలెపొంగు నర్సింహారావు, ధర్మసోత్ రామునాయక్, ఎండపల్లి. వెంకయ్య, తోట చినవెంకటరెడ్డి, బత్తిని యాలాద్రి, కృష్ణ, ఆంజనేయులు, జయరాజు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

### నాటు తుపాకీ పేలి యువకుడి మృతి?

దమ్మపేట: బంధువుల ఇంటికి వెళ్లిన గిరిజన యువకుడు(24) సరదాగా వేటకు వెళ్లగా, నాటు తుపాకీ పేలి దుర్మరణం చెందినట్టు సమాచారం. మండల పరిధిలోని రాచూరుపల్లి గ్రామానికి చెందిన ఓ గిరిజన యువకుడు ములకలపల్లి మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లినట్టు తెలిసింది. సమీపస్తులతో కలిసి ఆదివారం సమీప అటవీ ప్రాంతానికి వన్యప్రాణుల వేటకు వెళ్లినట్టు సమాచారం. ఈ తరుణంలో నాటు తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో తీవ్రంగా గాయపడినట్టు తెలిసింది. సహచరులు విషయాన్ని క్షతగాత్రుడి ఫోన్ ద్వారానే అతడి కుటుంబీకులకు సమాచారం అందించారు. స్వగ్రామానికి తరలించగా, అప్పటికే యువకుడు మృతి చెందినట్టు తెలిసింది. గుట్టుచప్పుడు కాకుండా మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించినట్టు సమాచారం. కాగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఘటనపై విచారణ చేపట్టామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

# సినీ నటుడు సుమన్ సందడి


అశ్వారావుపేట రూరల్ : సమ్మక్క-సారలమ్మ గద్దె వద్ద పూజ చేస్తున్న సుమన్

అశ్వారావుపేటరూరల్/సత్తుపల్లి రూరల్/ములకలపల్లి: ప్రముఖ సినీ నటుడు సుమన్ అశ్వారావుపేట మండలంలో సోమవారం పర్యటించారు. ఏపీలోని భీమవరంలో జరిగిన కార్యక్రమాలకు వెళ్లి వస్తున్న ఆయన అశ్వారావుపేట మండలంలోని తిరుమలకుంట, రెడ్డిగూడెం, బండారుగుంపు గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో గౌడ సంఘం బాధ్యులు, అభిమానులు, గ్రామ పెద్దలతో మాట్లాడిన సుమన్.. బండారుగుంపు సమీపంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా అభిమానులు ఆయనతో ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. ఇక సత్తుపల్లి మండలం గంగారం కూడా వెళ్లిన నటుడు సుమన్ ఇటీవల ఆవిష్కరించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, సోమగాని ప్రసాద్, చింత కొండలరావు, చీపు వీరస్వామి, పొట్టపల్లి వెంకటరత్నం, డాక్టర్ రాము, చల్లారి వెంకటసత్యనారాయణ, సోమగాని రాజా, నాయుడు రామకృష్ణ పాల్గొన్నారు. ఇక ములకలపల్లిలో నిర్మించిన ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో కూడా సుమన్ పూజలు చేశారు.

# మృతురాలి కుటుంబీకుల ఆందోళన

- అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి
- చంద్రుగొండ అంబేద్కర్‌కాలనీలో ఉద్రిక్తత


ఆటోలోనే ఉన్న శ్రావణి మృతదేహం


ఆందోళనకారులను శాంతింపజేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చంద్రుగొండ : వివాహిత మృతికి కారణమైన ఆమె భర్త, అతడి కుటుంబీకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు, కుటుంబీకులు సోమవారం ఆందోళన చేపట్టారు. చంద్రుగొండ అంబేద్కర్‌కాలనీకి చెందిన వివాహిత కుక్కముడి శ్రావణి (24) ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం విదితమే. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా శ్రావణి కుటుంబసభ్యులతోపాటు కాలనీవాసులు రోడ్డుపైనే అడ్డుకున్నారు. భర్త కుక్కముడి దివ్యతేజ్‌కుమార్‌తోపాటు అతడి కుటుంబసభ్యులే శ్రావణిని హతమార్చారని ఆరోపిస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసుల అదుపులో ఉన్న భర్త, అతడి కుటుంబసభ్యులను తీసుకురావాలని, వారే సంప్రదాయంగా అంత్యక్రియలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. శ్రావణి పిల్లలకు న్యాయం చేయడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌తోపాటు సీఐలు వసంత్‌కుమార్, రాజు, వెంకటేశ్వర్లు, అబ్బయ్య, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు ఎస్ఐలు గొల్లపల్లి విజయలక్ష్మి, షాహినా, పోట్రు గణేష్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. నచ్చజెప్పేందుకు డీఎస్పీ ప్రయత్నించినా ఆందోళనకారులు శాంతించలేదు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడు, బైక్‌లతో పోలీసు అధికారులు

ఖమ్మంక్రైం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడిని ఖమ్మం టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఏసీపీ గణేశ్, సీఐ శ్రీధర్ వెల్లడించారు. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రాపర్తినగర్ సెంటర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా బైక్‌పై వస్తున్న ఓ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నం చేయడంతో వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విచారణ చేపట్టగా సదరు వ్యక్తి ఎర్రగడ్డతండాకు చెందిన భూక్యా తిరుపతి అని, నగర పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేసి, వాటిని విక్రయిస్తూ వచ్చిన సొమ్ముతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నట్లు తేలింది. ఆయన నుంచి 12 బైకులను స్వాధీనం చేసుకోగా, ఖమ్మం టూటౌన్ పరిధిలో చోరీ చేసినవి నాలుగు, ఖమ్మం వన్ టౌన్ పరిధిలో చోరీ చేసిన బైక్ ఒకటి ఉందని తెలిపారు. మిగిలిన ఏడు బైక్‌ల వివరాల కోసం ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

### బిడ్డను కోల్పోయిన దంపతుల్లా...

**పెంపుడు కుక్క మరణంతో కన్నీరుమున్నీరు**


కుక్క మృతితో బోరున విలపిస్తున్న అరుణ్ కుటుంబీకులు

అశ్వారావుపేటరూరల్: కన్నబిడ్డలా కుక్కను పెంచుకుంటుండగా.. అది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపించిన ఘటన ఇది. అశ్వారావుపేటకు చెందిన చారుగండ్ల అరుణ్‌కుమార్ దంపతులు గతేడాది జనవరిలో ఏపీలోని విజయవాడ నుంచి గోల్డెన్ రిట్రీవర్ బ్రీడ్ కుక్కను తీసుకొచ్చి పెంచుకుంటున్నారు. యారా అని పేరు పెట్టగా, సోమవారం ఉదయం వాకింగ్ కోసం జాతీయ రహదారిపై తీసుకెళ్లినప్పుడు వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ ఢీకొట్టడంతో కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. అప్యాయంగా పెంచుకుంటున్న యారా మరణంతో అరుణ్‌కుమార్ కుటుంబీకులు ప్రధాన రహదారిపైనే బోరున విలపించారు. అనంతరం కుక్క కళేబరాన్ని ఖననం చేశారు.

### బొగ్గు పెళ్ల మీద పడి ఒకరికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ జీవన్‌లాల్

ఇల్లెందురూరల్: పట్టణంలోని సింగరేణి బైపాస్‌రోడ్డులో లారీ నుంచి సోమవారం బొగ్గు పెళ్ల మీద పడి ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన జీవన్‌లాల్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కారేపల్లి మండలం నుంచి ఇల్లెందుకు బైక్‌పై వస్తున్న జీవన్‌లాల్ తలపై ఎదురుగా వస్తున్న బొగ్గు లారీ నుంచి బొగ్గు పెళ్ల జారి పడింది. దీంతో తీవ్రగాయాలు కాగా జీవన్‌లాల్‌ను చికిత్స నిమిత్తం ఇల్లెందు ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు తలకు 30కిపైగా కుట్లు వేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా లారీల్లో బొగ్గు ఓవర్‌లోడ్ కారణంగానే తరచూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### వైరా రిజర్వాయర్‌లో దూకి వ్యక్తి ఆత్మహత్య

తల్లాడ: మద్యం మత్తులో ఓ వ్యక్తి వైరా రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలం దుద్దెపూడి గ్రామానికి చెందిన కలక పుల్లయ్య (55) మద్యం మత్తులో వైరా రిజర్వాయర్‌లో దూకాడు. నీట మునిగి మృతిచెందాడు. మృతదేహం కొడవటిమెట్ట సమీపంలోకి కొట్టుకుని రావడంతో పోలీసులు వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సురేశ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## తుని రైలు దహనం కేసు కొట్టివేత

### ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందికి ఊరట

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తుని రైల్వే స్టేషన్ సమీపంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందిని నిరపరాధులుగా పేర్కొంటు ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిపై పెట్టిన కేసును కొట్టివేస్తున్నట్లు విజయవాడ రైల్వే న్యాయమూర్తి తీర్పువెలువరించారు. 2016 జనవరి 31న ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో తునిలో తలపెట్టిన కాపు గర్జన బహిరంగ సభ హింసాత్మకంగా మారింది. ఆ సమయంలో అటుగా వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొంత మంది నిలిపివేసి దహనం చేశారు. ఈ ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాతో పాటు మొత్తం 41 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు 24 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ముద్దాయిలు నేరం చేసినట్లు ఎక్కడ ఆధారాలతో నిరూపించలేకపోవడంతో వారిని నిరపరాధులుగా భావించి కేసును డిస్మిస్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ముగ్గురు తుని ఆర్‌పీఎఫ్ అధికారులు సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని తీర్పులో వెల్లడించారు.

# థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రావెన్స్‌లో ఉన్న ఆసియా హోటల్‌లోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై అక్కడి పోలీసులు సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో (అక్కడి కాలమాన ప్రకారం) దాడి చేశారు. మొత్తం 94 మందిని అదుపులోకి తీసుకోగా వారిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డితోపాటు మరో 83 మందిని భారతీయులుగా గుర్తించారు. వారిలో అత్యధికులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారేనని, 14 మంది మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కెసినో నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ప్రవీణ్, మాధవరెడ్డి, సిత్రానన్ సహా ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారని, పేకాట రాయుళ్లకు కౌన్సెలింగ్ చేసి, జరిమానా వేసి పంపినట్లు థాయ్ మీడియా ప్రకటించింది.

### ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షలు వసూలు చేసి...

థాయ్‌లాండ్‌లో కెసినోల నిర్వహణకు అనుమతి ఉన్నప్పటికీ ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్జించాలని భావించిన చీకోటి, మాధవరెడ్డి... థాయ్ మహిళ సిత్రానన్‌తో కలసి అక్రమంగా కెసినో నిర్వహణకు పథకం వేశారు. అనేక మంది పేకాటరాయుళ్లతో (పంటర్లు) ఒప్పందాలు కుదుర్చుకొని వారి నుంచి హైదరాబాద్‌లో ప్రాథమిక మొత్తంగా రూ. 4 లక్షల చొప్పున వసూలు చేశారు. గత నెల 26న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తీసుకువెళ్లిన వారికోసం పటాయాలోని ఆసియా హోటల్‌లో గత నెల 27 నుంచి సోమవారం వరకు గదులు బుక్ చేశారు. అదే హోటల్‌లో శాంపోయ్ పేరుతో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. అందులోనే అక్రమంగా కెసినో కేంద్రం ఏర్పాటు చేశాడు. దీని నిర్వహణకు సిత్రానన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రవీణ్... ఒక్కో పంటర్‌కు రూ. 50 వేలు చెల్లించాడు. హైదరాబాద్ నుంచే తీసుకువెళ్లిన గేమింగ్ చిప్స్ అందించి పేకాట ఆడిస్తున్నాడు. ఈ క్యాంప్ ముగిశాక హైదరాబాద్ వచ్చాకే నగదు లావాదేవీలు చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలా చేస్తే ఫెమా వంటి సెక్షన్ల కింద నమోదయ్యే ఈడీ కేసుల నుంచి తప్పించుకోవచ్చని ప్రవీణ్ పథకం వేశాడు. ఐదు రోజులపాటు జరిగిన ఈ పేకాట శిబిరంలో రూ. కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. సోమవారం దాడి చేసిన పోలీసులు రూ. 16 లక్షల విలువైన భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పట్టుబడిన పంటర్లలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్‌లో ప్రవీణ్ అండ్ గ్యాంగ్ అరెస్టు విషయం తెలిసిన హైదరాబాద్ పోలీసులతోపాటు నిఘా వర్గాలు, ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు



పోలీసులు అదుపులో భారతీయులు

# 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

వచ్చే సీజన్లో వ్యవసాయ శాఖ లక్ష్యం

- కంది పంట సాగును ప్రోత్సహించాలి
- మార్చికల్లా యాసంగి కోతలు పూర్తి చేయాలి
- వ్యవసాయంపై మంత్రి నిరంజన్‌రెడ్డి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా ప్రకటించింది. కనీసం 60 లక్షల నుంచి 65 లక్షల ఎకరాల్లో సాగయ్యేలా చూడాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయంలోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన తొలి సమీక్షలో వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. రానున్న వానాకాలంలో 1.40 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. మరో 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసేలా చూడాలన్నారు. అందుకనుగుణంగా వ్యవసాయశాఖ సమాయత్తం కావాలని ఆదేశించారు. పత్తితోపాటు కంది సాగును మరింత ప్రోత్సహించాలని, ప్రస్తుతం వివిధ పంటల సాగుకు అవసరమయ్యే 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. సేంద్రీయ సాగు, భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలనీ దీనికి రూ.76.66 కోట్లు నిధుల విడుదల చేయాలని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటల సాగుకై డీసీసీబీల ద్వారా ఎకరానికి రూ.40 వేలు వరకు పంటరుణాలు అందించాలని సూచించారు.

### వరి సీజన్‌ను ముందుకు జరపాలి...

ప్రతీ ఏడాది మార్చి చివరి వరకు యాసంగి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే వడగళ్ల వానల నుంచి నష్టాన్ని నివారించవచ్చని నిరంజన్‌రెడ్డి సూచించారు. వానాకాలం సాగు సమయంలోనే యాసంగి వరి సాగు నారుమళ్లకు అవసరమయ్యే భూమిని వదులుకోవాలని చెప్పారు. బాన్సువాడ, బోధన్, హుజూర్‌నగర్, మిర్యాలగూడల మాదిరిగా వరి సాగు సీజన్ ముందుకు జరపాలని సూచించారు. సమీక్షలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, హాకా చైర్మన్ మచ్చా శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ హన్మంతరావు, ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ పాల్గొన్నారు.

# ఢిల్లీలో వ్యాపారం.. హైదరాబాద్‌లో ఆస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, శరత్‌చంద్రా రెడ్డి, కవిత సన్నిహితుడు వి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్, ఫీనిక్స్ గ్రూపు, ఎన్‌గ్రోత్ క్యాపిటల్, క్రియేటివ్ డెవలపర్స్ తదితరుల పేర్లను ప్రస్తావించింది. నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అసాధారణ అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పింది.

### చార్జిషీటులోని ముఖ్యాంశాలు

- ఆప్ నేతలకు సౌత్‌గ్రూపు రూ.100 కోట్లు హవాలా రూపంలో ముడుపులిచ్చింది. తద్వారా మద్యం విధానం తమకు అనుకూలంగా ఉడేలా చూసుకుంది.
- అరుణ్‌పిళ్లైకి క్రియేటివ్ డెవలపర్స్ భాగస్వాములు, రవిశంకర్ చెట్టి రూ.5 కోట్లకు హైదరాబాద్‌లో భూమి అమ్మారన్న ఆరోపణలున్నా వారెవరూ అరుణ్‌పిళ్లైను కలవలేదు. ఈ ఒప్పందాన్ని ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ గ్రూప్‌నకు చెందిన శ్రీహరి చర్చలు జరిపి ఖరారు చేశారు. భూమి కొనుగోలు నిమిత్తం సంస్థకు ఒకరు డబ్బులు బదిలీ చేస్తారని చెప్పిన శ్రీహరి.. ఎవరు డబ్బులు బదిలీ చేశారనేది రవిశంకర్ చెట్టికి చెప్పలేదు. అయితే, ఎన్‌గ్రోత్ కాపిటల్ పేరుతో ఫీనిక్స్ గ్రూపునకు చెందిన శ్రీహరి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు బుచ్చిబాబు తన వాంగ్మూలంలో చెప్పారు. ఆ సమయంలో ఫీనిక్స్ గ్రూపునకు సీవోవోగా శ్రీహరి ఉన్నారు. దీంట్లో కవిత భర్త అనిల్‌కుమార్ కూడా భాగస్వామి. కవిత తెలంగాణలో పెద్ద రాజకీయ నాయకురాలు కావడంతో మార్కెట్ రేటు కంటే తక్కువకే భూమి కొనుగోలు చేశారు. దీంతోపాటు కవిత మరో ప్రాపర్టీ కూడా కొనుగోలు చేశారు. 25వేల చదరపు అడుగుల ప్రాపర్టీకి సంబంధించిన పేపర్ వర్క్‌ను బుచ్చిబాబు, శ్రీహరి పూర్తిచేశారు. మార్కెట్ ధర చదరపు అడుగు రూ.1,760 ఉంటే రూ.1,260 మాత్రమే చెల్లించారు. కవితతో గణనీయమైన ఆర్థిక లావాదేవీలున్న వ్యక్తి రవిశంకర్‌తో భూమి కొనుగోలుకు చర్చలు జరిపినట్లు నిర్ధారణకు వచ్చాం. ఇండోస్పిరిట్స్‌లో కవిత తరఫున అరుణ్‌పిళ్లై ప్రతినిధిగా వ్యవహరించి రూ.32.86 కోట్లు అందుకున్నారు. పిళ్లై సూచన మేరకు రూ.25.5 కోట్లు నేరుగా ఇండోస్పిరిట్స్ నుంచి పిళ్లై ఖాతాకు బదిలీ అయ్యాయి.
- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మద్యం దుకాణం నిమిత్తం ఎన్‌వోసీ కోసం జీఎంఆర్ గ్రూపునకు చెందిన బీవీ నాగేశ్వరరావుతో మాగుంట రాఘవ, ఎంపీ ఎంఎస్ రెడ్డి చర్చలు జరిపారు. ఎంఎస్ రెడ్డి వాట్సాప్ సందేశాల ద్వారా ఇది వెల్లడైంది. వ్యాపారంలో భాగస్వాములై ఎన్‌వోసీ ఇవ్వాలని కోరినట్లు తేలింది. ఇండోస్పిరిట్స్‌లో అరుణ్ పిళ్లై ప్రాక్సీ భాగస్వామి. ఇండోస్పిరిట్స్ నుంచి లాభాలు తన నుంచి కవితకు చేరడంపై అరుణ్‌పిళ్లై స్టేట్‌మెంట్ల ద్వారా వెల్లడైంది.
- ఏప్రిల్ 2022లో ఢిల్లీ హోటల్లో విజయ్‌నాయర్‌తో కవిత, అరుణ్‌పిళ్లై సమావేశమయ్యారు. వ్యాపారం కుంటుపడుతున్న నేపథ్యంలో చెల్లించాల్సిన లంచాలు రికవరీ చేయడంపై చర్చించారు. హోటల్ రికార్డుల ద్వారా దీన్ని ధ్రువీకరించుకున్నాం. దినేశ్ ఆరోరా, అరుణ్‌పిళ్లై వాంగ్మూలాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి.
- కిక్‌బ్యాక్‌ల రూపంలో సొమ్ములు వెనక్కి మళ్లించే పనులను అభిషేక్ బోయినపల్లి, అరుణ్‌పిళ్లై నిర్వహించినట్లు ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలమిచ్చారు. సౌత్‌గ్రూప్ నుంచి కిక్‌బ్యాక్‌లను విజయనాయర్ అందుకుంటున్నారన్నారు. విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని బుచ్చిబాబు ఫోను నంబర్ల ద్వారా చేసిన వాట్సాప్ సందేశాల ద్వారా ధ్రువీకరణ అయింది. దీంట్లో 'వీ'కి డబ్బు కావాలి అంటే విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని అర్థమని బుచ్చిబాబు తెలిపారు.
- ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్లలో జరిగిన సమావేశాల్లో సౌత్‌గ్రూపు నుంచి విజయ్‌నాయర్‌కు డబ్బులు పంపడంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు కూడా బుచ్చిబాబు తెలిపారు. క్రియేటివ్ డెవలపర్స్ ఖాతాకు డబ్బు మళ్లించడం కూడా బుచ్చిబాబు నోట్స్ ద్వారా తెలిసింది. కవిత తరఫున ఇండోస్పిరిట్స్ నుంచి వచ్చిన లాభాలను అరుణ్‌పిళ్లై అందుకొని ఆమె ఆదేశాల మేరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉందని ధ్రువీకరణ అయింది. భూముల కొనుగోలులో శ్రీహరి సూచనల మేరకు కవిత తరఫున సొమ్ములు బదిలీ చేయడం వరకే పిళ్లై పాత్ర పరిమితమని తేలింది. అయితే, మే 2022 నుంచి రిజిస్టర్ కాకుండా ఉన్న భూమి 11.10.22న అరుణ్‌పిళ్లై భార్య పేరు మీద రిజిస్టర్ కావడం అరుణ్‌పిళ్లై ప్రయోజనం కోసమేనని, కవితకు లాభదాయకం కాదని దర్యాప్తులో తేలింది. అరుణ్‌పిళ్లై ఆదేశాల మేరకే ఇండోస్పిరిట్స్ నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్‌లకు రూ.కోటి, రూ.70 లక్షలు బదిలీ చేసినట్లు సమీర్ మహేంద్రు తెలిపారు. దీనికి మద్దతుగా ఎలాంటి రికార్డు లేదు. అయితే, అరుణ్‌పిళ్లై చెప్పినట్లుగా ఈ సంస్థలు ఇండో స్పిరిట్స్ లేదా అరుణ్‌పిళ్లైకి ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆయా సంస్థలకు ఇచ్చిన సొమ్ము ఇప్పటివరకూ వెనక్కి ఇవ్వలేదు. గౌతమ్ ముత్తాకు అరుణ్‌పిళ్లై బదిలీ చేసిన రూ.4.76 కోట్లు, అభిషేక్‌కు రూ.3.85 కోట్లు బదిలీ రుణం తిరిగి ఇవ్వమని చెప్పినప్పటికీ కాలక్రమేణా ఎలాంటి రుణం లేదని అరుణ్‌పిళ్లై పేర్కొన్నారు.

# జూడాల సమ్మె నేపథ్యంలో సెలవులు రద్దు

మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల అధికారులకు డీఎంఈ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్లు (జూడా) బుధవారం నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు సర్క్యులర్ జారీ చేశారు. తమ స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలని, న్యాయమైన ఇతర సమస్యలు పరిష్కరించాలని జూడాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంఈ పలు చర్యలకు నడుం బిగించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకులకు అన్ని సెలవులు రద్దు చేసినట్లు డీఎంఈ పేర్కొన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అధ్యాపకుల డ్యూటీ రోస్టర్‌ను మూడు షిఫ్టుల్లో సిద్ధం చేయాలన్నారు. ఏ విభాగంలోనైనా అసిస్టెంట్ ప్రొఫెసర్లు తక్కువగా ఉంటే, అసోసియేట్ ప్రొఫెసర్‌ను కూడా విధుల్లో ఉంచాలన్నారు. సంబంధిత ప్రొఫెసర్లు, విభాగాధిపతులు తమ యూనిట్లను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. రోగుల వైద్య సేవలపై సమ్మె ప్రభావం పడకుండా చూడాలన్నారు.

# సచివాలయానికి ఐజీబీసీ గోల్డ్ రేటింగ్

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుకూల పద్ధతులు, సీళ్ల, విద్యుత్ పొదుపు ఏర్పాట్లతో నిర్మించిన కొత్త సచివాలయానికి 'ది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్'(ఐజీబీసీ) గోల్డ్ రేటింగ్ ఇచ్చింది. కౌన్సిల్ ప్రతినిధులు సోమవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సచివాలయంలో సర్టిఫికెట్‌ను అందజేశారు. నీటిపొదుపుతోపా టు, వాన నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం తీసుకున్న చర్యలకుగాను సచివాలయం.. ఐజీబీసీ గోల్డ్ రేటింగ్‌కు ఎంపికైంది. నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఈఈ శశిధర్‌లను మంత్రి అభినందించారు. అంతకుముందు మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. వర్షా లతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.518 కోట్లతో 1393 కిలోమీటర్ల పొడవైన రోడ్ల మరమ్మతులు పూర్తి చేశామని, రూ.1223 కోట్లతో మరో 2700 కి.మీ. పనులు 45 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సమీక్షలో ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

## రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు



ఆలయంలో ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని దంపతులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామి వారిని ఏపీ రాష్ట్రానికి చెందిన మాజీ మంత్రి పేర్ని నాని దంపతులు సోమవారం దర్శించుకున్నారు. అలాగే, మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయినికి చెందిన అఖిల భారత నాథ్ సంప్రదాయ పీఠాధీశ్వరులు యోగిఫిర్ రామ్‌నాథ్‌తో పాటు సినీ నటి, భద్రాచలం వాసి కల్పలత దంపతులు కూడా స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్న వారు ఉపాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ రమాదేవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజనులందరికీ పథకాలు

### ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



దరఖాస్తులను స్వీకరిస్తున్న డేవిడ్‌రాజ్

భద్రాచలం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం శాఖల వారీగా అధికారులకు అందజేశాక ఏపీఓ మాట్లాడారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేయడమే కాక అర్హతల మేరకు ఐటీడీఏ ద్వారా పథకాలను అందించాలని ఆదేశించారు. కాగా, గిరిజన దర్బార్‌లో పథకాలకు సంబంధించిన వినతిపత్రాలను మాత్రమే తీసుకుంటామని, ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ దర్బార్‌లో అధికారులు సురేశ్‌బాబు, ప్రభాకర్‌రావు, మునీర్‌పాషా, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మొదటి నెల 97 శాతంతో సరి

- సింగరేణిలో తొలి మాసం బొగ్గు ఉత్పత్తి ఆశాజనకమే..
- ఏప్రిల్‌లో వంద శాతం దాటిన నాలుగు ఏరియాలు
- లక్ష్య సాధనలో ఇల్లెందు, ఉత్పత్తిలో మణుగూరు టాప్



ఓపెన్‌కాస్ట్ గనుల్లో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో 750 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ మేరకు ఆర్థిక సంవత్సరం మొదటి మాసం ఏప్రిల్‌లో 53,64,786 టన్నుల లక్ష్యానికి గాను 52,19,128 టన్నుల(97 శాతం) ఉత్పత్తి నమోదైంది. జూన్ నుంచి వర్షాలు మొదలుకానున్న నేపథ్యాన ఏప్రిల్, మే నెలల్లో 110 శాతం ఉత్పత్తి చేయగలిగితే ఆ తర్వాత వెనుబడినా ఇబ్బంది ఉండదని సీఎండీ శ్రీధర్ సహా ఉన్నతాధికారులు సూచనలిచ్చారు. అయితే, లక్ష్యాన్ని చేరుకోకపోయినప్పటికీ కాస్త మెరుగైన స్థాయిలోనే ఉత్పత్తి నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ప్రతీనెల అన్ని ఏరియాల్లో 100 శాతం ఉత్పత్తి చేయగలిగితేనే సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యసాధన సాధ్యమవుతుంది. సింగరేణివ్యాప్తంగా 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో 47,25,001 టన్నుల లక్ష్యానికి 47,70,231 టన్నుల (101శాతం) ఉత్పత్తి సాధించగా, 24 భూగర్భ గనుల్లో 6,39,785 టన్నులకు గాను 4,48,897 టన్నుల (70 శాతం) ఉత్పత్తి నమోదైంది.

### అగ్రభాగాన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏరియాలు

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు గాను కేవలం నాలుగు ఏరియాల్లో ఏప్రిల్‌లో ఉత్పత్తి వంద శాతం దాటింది. ఇందులో మూడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏరియాలే ఉండడం విశేషం. ఇల్లెందు ఏరియా 137 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, 122 శాతం ఉత్పత్తితో మణుగూరు ఏరియా రెండో స్థానం, బెల్లంపల్లి ఏరియా 116 శాతంతో మూడో స్థానం, కొత్తగూడెం ఏరియా 110 శాతంతో నాలుగో స్థానంలో నిలిచాయి. ఇక మణుగూరు ఏరియాలో సింగరేణి వ్యాప్తంగా ఎక్కడా సాధించని విధంగా 11,27,736 టన్నుల ఉత్పత్తి సాధించడం మరో విశేషంగా చెప్పొచ్చు. ఇక మిగిలిన ఏడు ఏరియాలు వెనుకంజలో ఉండగా.. 47 శాతం ఉత్పత్తితో ఆండ్రియాలా ఏరియా చివరి స్థానంలో నిలిచింది.

### రోజువారీ ఉత్పత్తిలో బెల్లంపల్లి ఫస్ట్

సంస్థ నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యాన్ని రోజువారీ, నెలవారీగా విభజించి వాటిని చేరుకునేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు సంస్థవ్యాప్తంగా రోజువారీ లక్ష్యం 2,22,817 టన్నులుగా నిర్దేశించారు. అన్ని ఏరియాల కంటే బెల్లంపల్లి ఏరియా 10,833 టన్నులకు 15,008 టన్నుల ఉత్పత్తి 139 శాతం నమోదు చేయగా.. మిగతా ఏ ఏరియాలు కూడా వంద శాతం చేరుకోలేదు. ఇక నెలవారీ లక్ష్య సాధనలో ఇల్లెందు ఏరియా మొదటి స్థానం సాధించగా, బొగ్గు ఉత్పత్తిలో మణుగూరు అగ్రభాగాన నిలిచిందని సంస్థ అధికారులు వెల్లడించారు.

**ఏప్రిల్‌లో ఏరియాల వారీగా ఉత్పత్తి, శాతం వివరాలు**

| ఏరియా | నెలవారీ లక్ష్యం | సాధించిన ఉత్పత్తి | శాతం |
|---|---|---|---|
| ఇల్లెందు | 2,40,000 | 3,28,000 | 137 |
| మణుగూరు | 9,27,667 | 11,27,736 | 122 |
| బెల్లంపల్లి | 2,49,167 | 2,88,849 | 116 |
| కొత్తగూడెం | 9,71,271 | 10,67,489 | 110 |
| ఆర్జీ–2 | 7,22,009 | 7,14,095 | 99 |
| ఆర్జీ–3 | 4,21,667 | 4,16,386 | 99 |
| మందమర్రి | 3,53,146 | 2,87,773 | 81 |
| భూపాలపల్లి | 3,71,833 | 2,47,621 | 67 |
| శ్రీరాంపూర్ | 6,00,396 | 3,47,542 | 58 |
| ఆర్జీ–1 | 3,70,492 | 3,29,846 | 59 |
| ఆండ్రియాల | 1,37,138 | 63,791 | 47 |
| మొత్తం | 53,64,786 | 52,19,128 | 97 |

### లక్ష్యసాధనపై త్వరలో సమీక్షలు



వార్షిక లక్ష్యాన్ని చేరుకునేలా మొదటి నుంచే ప్రత్యేక దృష్టి సారించాం. ఇక నుంచి ప్రతిరోజూ గనుల వారీగా ఉత్పత్తిపై పర్యవేక్షిస్తూ వెనుకంజలో ఉంటే కారణాలను సమీక్షిస్తాం. అంతేకాక గనులను నేరుగా తనిఖీ చేస్తాం. ఒకరోజు వెనుకబడినా మరోరోజు రెండు రోజుల లక్ష్యాన్ని సాధించేలా పర్యవేక్షిస్తాం.

–ఎస్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ (పా)

# జిల్లా వాసులకు 'శ్రమశక్తి' అవార్డులు



రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న రాధాకృష్ణ, రంగనాథ్, శ్రీనివాసరావు, వీవీఎస్ఎస్.స్వామి, కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య

కొత్తగూడెం అర్బన్/పాల్వంచ/ఇల్లెందు/సత్తుపల్లి రూరల్/సింగరేణి(కొత్తగూడెం): ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు కార్మిక సంఘాల నాయకులు రాష్ట్రప్రభుత్వం మేడే సందర్భంగా ప్రకటించిన శ్రమశక్తి అవార్డులకు ఎంపికయ్యారు. ఈమేరకు వీరు సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శాఖ మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. పాల్వంచ కేటీపీఎస్ ఉద్యోగి, తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.రంగనాథ్, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ ఉద్యోగి గణపనేని శ్రీనివాసరావు, టీబీజీకేఎస్ నాయకులు వీవీఎస్ఎస్.స్వామి, కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

# డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాల్సిందే..

- లేకపోతే వచ్చేనెలలో రేషన్ దుకాణాలు బంద్
- ఉమ్మడి జిల్లా డీలర్ల సమావేశంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాజు



మాట్లాడుతున్న నాయికోటి రాజు

ఖమ్మంరూరల్: కమీషన్ సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించాలని.. ఈ విషయమై వచ్చేనెలలోగా నిర్ణయం వెలువరించకపోతే దుకాణాలు నిరవధికంగా బంద్ చేస్తామని రేషన్ డీలర్ల సంఘం జేఏసీ రాష్ట్ర చైర్మన్ నాయికోటి రాజు వెల్లడించారు. ఖమ్మంరూరల్ మండలం పెద్దతండాలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రేషన్ డీలర్లకు నెలకు రూ.45 వేలు, పట్టణ ప్రాంత డీలర్లకు రూ.60 వేలు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా పనిచేస్తున్న తాము అరకొర కమీషన్‌తో బతుకుతున్నామని తెలిపారు. గోదాం నుంచి వచ్చే బియ్యం తూకం తక్కువ ఉండటంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇకనైనా గౌరవ వేతనం ప్రకటించడంతో పాటు గ్రూపు ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని, రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చాలని, హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో రేషన్ భవనాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బత్తుల రమేశ్‌బాబు, డి.రవీందర్, జి.మల్లికార్జున్‌గౌడ్, వెంకన్న, దుర్గయ్య వెంకటేశ్వరరావు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం/పాల్వంచరూరల్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ డీడీ రమాదేవి సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని వెలికితీయడమే కాక నైపుణ్యాలు పెంపొందించడానికి క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నిష్ణాతులైన ట్రెయినర్లు చెప్పే మెళకువలతో భవిష్యత్‌లో జీవనోపాధికి బాటలు వేసుకోవచ్చని వివరించారు. పదిహేను రోజుల పాటు వంద మంది బాలికలకు భద్రాచలంలో, వంద మంది బాలురకు ఉసిరికాయలపల్లిలో కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, వ్యాసరచన, పాటలు, పద్యాలతో పాటు కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, మెహందీ శిక్షణ ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింహారావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం జ్యోతితో పాటు పార్వతి, మెర్సీ, రవికాంత్, వేణుగోపాల్ పాల్గొన్నారు. అలాగే, పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని కూడా డీడీ రమాదేవి ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడ 120 మంది బాలురు, 120 మంది బాలికలకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారని వివరించారు. ఐటీడీఏ క్రీడల అధికారి డాక్టర్ వీరూనాయక్, ఏటీడీఓ చంద్రమోహన్, హెచ్ఎం ఎస్.చందు, క్యాంప్ ఇన్‌చార్జ్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

## వర్షంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం

సత్తుపల్లిరూరల్: జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షంతో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపునకు అంతరాయం ఏర్పడింది. జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో నీరు చేరడంతో 60 టన్నుల బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు నిలిచిపోగా, అధికారులు మోటార్ల సాయంతో నీరు తొలగించే పనులు మొదలుపెట్టారు.